క్లుప్తంగా

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

ఉప్పునుంతల: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 'సాక్షి' దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. డీఈఈ హేమలత ఆదేశాలపై ఏఈ సాయికృష్ణ దగ్గర ఉండి సిబ్బందితో పైప్‌లైన్ లీకేజీని సరి చేయించారు.

నేడు సంక్షిప్త మహాభారతం పుస్తకావిష్కరణ

నాగర్‌కర్నూల్: కందనూలు కళా సేవా సమితి ఆధ్వర్యంలో పౌరాణిక కళాకారులు, గాయకులు, కవి, రచయిత, గుడిపల్లి మాజీ సర్పంచ్ బి. నరసింహారెడ్డి రచించిన 'సంక్షిప్త మహాభారతం' అనే పుస్తకం నాగర్‌కర్నూల్ పట్టణంలోని సుఖజీవన్ గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు ఆవిష్కరించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి జి.మురళీధర్ రావు తెలిపారు. పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథులుగా తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరు శివారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రాష్ట్ర శాసనమండలి సభ్యులు, ప్రజాకవి గోరటి వెంకన్న, కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని మాడల్ స్కూల్ ఆవరణలో సీబీసీసీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వనిత శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. టోర్నీలో అండర్ 7, 9, 11, 13, 15 వయస్సు వారీగా చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9381212698 ఫోనను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం

లింగాల: మండల పరిధిలోని అవుసలికుంటలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు గ్రామదేవత బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రామ పొలిమేర్లలో ఉన్న కోట మైసమ్మకు పూజలు, బోనాలు తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభం

చారకొండ: ప్రభుత్వ పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందించాలని మండల విద్యాధికారి శంకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో మండల సమాఖ్య భవనంలో శనివారం మహిళా సంఘాల సభ్యులతో విద్యార్థుల యూనిఫాం తయారీకి, కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలోని 1,224 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల కొలతల ద్వారా కుట్టు చేయాలని, పాఠశాలల ప్రారంభానికి అందించాలన్నారు. డీపీఎం, నర్సింహులు, ఏపీఎం బాలచందర్, సీసీలు, వీఓఏలు ఉన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

చారకొండ: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాలో మండలంలోని కూలీలు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధి కూలీలకు పెండింగ్‌లోని బిల్లులను వెంటనే చెల్లించాలని, పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్, దూర ప్రాంతానికి వాహన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

29న నర్సింహస్వామి పూజలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని కుర్మిద్దలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి సుబ్రహ్మణ్య నవగ్రహ దేవతల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి తెలిపారు. వేకువజామున సుప్రభాతం కార్యక్రమాలు ప్రారంభమవుతాయని 11.30 గంటలకు లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. కల్యాణ మహోత్సవంలో కల్వకుర్తి సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందిని పెంచాలి

నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో శానిటేషన్ సిబ్బందిని పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం బృందం ఆస్పత్రిని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి మొత్తం దుర్వాసనతో ఉందని అన్నారు. ఆస్పత్రిలో పరిశుభ్రత లేకపోవడంతో రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దానిని ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని, తక్షణమే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో మధు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలకు రసీదులు తీసుకోవాలి

బిజినేపల్లి: విత్తన దుకాణాల్లో కొనుగోలు చేసే విత్తనాలకు రైతులు తప్పకుండా రశీదు తీసుకోవాలని ఏఓ నీతి సూచించారు. శనివారం మండలంలోని ఖానాపూర్‌లో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న రైతు, కూలీలతో సమావేశమై విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఏఓ నీతి మాట్లాడారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్‌పై ఎంఆర్‌పీ ధర, విత్తన ముగింపు సమయం, జీఈపీసీ నంబర్ వంటివి తప్పకుండా గమనించాలని సూచించారు.

కంపెనీ ఇన్వాయిస్‌లు తప్పనిసరి

కంపెనీల నుంచి విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసే వ్యాపారులు ఆ కంపెనీ ఇన్వాయిస్‌లు తప్పనిసరిగా భద్రపరచాలని తిమ్మాజీపేట ఏఓ కమల్‌కుమార్ సూచించారు. శనివారం తిమ్మాజీపేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద విత్తన వ్యాపారులకు సమావేశం ఏర్పాటు చేసి రైతులకు విక్రయించే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై సూచనలు సలహాలు చేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

పెద్దకొత్తపల్లి: ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు అమ్మితే ఆ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారిని శ్రీరాం, ఎస్‌ఐ సతీష్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి దుకాణంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను రైతులకు అమ్మాలని సూచించారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఆధార్‌కార్డు తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని పొందాలన్నారు. ఏఈఓలు జానకిరాం, శిరీష, ముజీబ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి

వెల్దండ: పంటలు సాగుచేసే రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకొని అధిక దిగుబడి సాధించాలని మండల వ్యవసాయ అధికారిణి మంజుల పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొట్ర, పోతేపల్లి, వెల్దండ, పెద్దాపూర్, తిమ్మినోనిపల్లి తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. రైతులు విత్తనాలను ఆదీకృత(లైసెన్స్) డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.



ఉప్పునుంతలలో అవగాహన కల్పిస్తున్న ఏఓ సునీత, ఏఈఓ మంజుల

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం ఏఓ టెక్నికల్ పల్లవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాక్ రిజిస్టర్, స్టాక్‌ను పరిశీలించారు. ఫర్టిలైజర్ కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు అందజేయాలన్నారు.

ప్రణాళిక సిద్ధం

రాబోయే వర్షాకాలానికి సంబంధించి పంటల సాగు తదితర అంశాలను చర్చించేందుకు శనివారం కల్వకుర్తి మండల పరిధిలోని 9 క్లస్టర్లలో రైతు సదస్సు నిర్వహించారు. ఆయా క్లస్టర్లకు చెందిన ఏఈఓలు ఈ సదస్సులో పంటల సాగుపై సూచనలు చేశారు. వర్షాకాలంలో సాగు చేసే పంటల సాగు కోసం ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రభుత్వ సూచనలతో పాటు రైతులు వెల్లడించిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ప్రణాళిక సిద్ధం చేశామని ఆయా క్లస్టర్ల ఏఈఓలు తెలియజేశారు.

అధిక ధరలకు విత్తనాలు

బిజినేపల్లి: మండలంలో పత్తి సాగు విస్తీర్ణం పెరగడంతో, కొందరు పత్తి విత్తన వ్యాపారులు రశీదుల్లో ఎంఆర్‌పీ ధరలను నమోదు చేసి నగదు రూపంలో ఒక్కో ప్యాకెట్‌పై రూ.100 నుంచి రూ.150 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ఏఓ నీతి గ్రామాల్లో పత్తి ప్యాకెట్లపై అవగాహన కల్పించేందుకు వెళ్లింది. కార్యక్రమానికి వచ్చిన రైతులు పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గౌతమి సీడ్స్, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ఫర్టిలైజర్స్, భాగ్యలక్ష్మి ట్రేడర్స్, సాయి ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. నగదు రూపంలో సదానంద్, తడాకా పత్తి విత్తనాలు ఒక్కో ప్యాకెట్‌కు రూ.100 నుంచి రూ.150కి పైగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు.

జాగ్రత్తలు అవసరం

ఉప్పునుంతల: పంటల సాగుకు విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి మండల వ్యవసాయాధికారిణి సునీత సూచించారు. శనివారం మండల కేంద్రంలో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు.

లింగాల: ఎరువులు, విత్తనాలు, ఇతర క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగ్గా రసీదులు ఇవ్వాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ జగన్మోహన్ డీలర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం మండల వ్యవసాయ శాఖ, పోలీసులు తనిఖీ చేశారు.

ముందస్తు ప్రణాళిక అవసరం

వానా కాలం పంటల సాగు విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తకుంటపల్లి, కొత్తచెర్వుతండాలో పర్యటించిన ఏఓ రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు.

కోడేరు: మండలంలో డీలర్లు ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని కొల్లాపూర్ సీఐ మహేష్, మండల వ్యవసాయ అధికారి శ్రీరాం హెచ్చరించారు.



ఖానాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెద్దకొత్తపల్లిలో తనిఖీ చేస్తున్న అధికారులు



లింగాల మండలం కొత్తకుంటపల్లిలో..

వాహనాలకు పత్రాలు ఉండాలి

చారకొండ: రోడ్డుపై తిరిగే ప్రతి వాహనానికి సంబంధిత పత్రాలు తప్పనిసరి ఉండాలని ఎస్‌ఐ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో కల్వకుర్తి –దేవరకొండ ప్రధాన రహదారిపై శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహన సంబంధిత పత్రాలను పరిశీలించారు. వాహనదారులు సంబంధిత పత్రాలు ఆర్‌సీ, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రాజశేఖర్

బీసీలకు సరైన రిజర్వేషన్ కల్పించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: బీసీలకు సరైన రిజర్వేషన్ కల్పించాలి బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కుంభం మల్లేష్‌గౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా కొనసాగనున్న సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి, సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ఓట్లను తమ పార్టీకి అనుకూలంగా వేయించుకొని తగిన న్యాయం చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా 34 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుధాకర్‌గౌడ్, గంగోజి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

మట్టి తవ్వకాలు ఆపాలని వినతి



వినతి అందజేస్తున్న యువకులు

తాడూరు: మండల కేంద్రంలోని ఎర్రకుంటలో ఇష్టానుసారంగా కొనసాగుతున్న మట్టి తవ్వకాలను ఆపాలంటూ శనివారం గ్రామానికి చెందిన యువకులు డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్‌అలీకి వినతి అందజేశారు. నెల రోజుల నుంచి ఇష్టానుసారంగా సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున గుంతలు ఏర్పాటు చేసి మట్టిని ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారంటూ వినతిలో పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఈ తవ్వకాలు జరుగుతుంటే అధికారులు పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. రమేష్, శ్రీనివాస్, చంద్రయ్య, శేఖర్ తదితరులు విన్నవించారు.

ప్రత్యేకాధికారికి వినతి

తెలకపల్లి: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి వెంకటయ్యకు గ్రామయువకులు, నిరుద్యోగులు వినతి అందజేశారు. శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఓ భాస్కర్‌తో పాటు కొమ్ము ఆనంద్, రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్మూరు మండలం తుమ్మన్‌పేట్‌కు చెందిన మల్లేష్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో బస్సు, ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాయి. గమనించిన స్థానికులు జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సీబీఐకి అప్పగించాలి

కొల్లాపూర్: చిన్నంబావి మండలం లక్ష్మీపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసును సీబీఐకి అప్పగించాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హత్యకేసు విచారణ లోపభూయిష్టంగా ఉందని ఆరోపించారు. స్థానిక పోలీసుల మీద ప్రజలకు నమ్మకం లేకుండా పోతోందన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

కోడేరు: మండలంలోని మైలారం, ఠాగూర్‌తండాలో ఎక్సైజ్ ఎస్‌ఐ హనుమంతు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించి. 5 లీటర్ల సారా 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మరో ముగ్గురుని తహసీల్దార్ విజయ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మండలంలో ఎవరైనా సారా కాచినా.. విక్రయించినా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

వెల్దండ: మండల పరిధిలోని చెదురుపల్లి మాజీ సర్పంచ్ రాత్లావత్ వాల్యానాయక్(78) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ నెల 22న వెల్దండ సమీపంలో లారీ, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాల్యానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజుల పాటు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు పరామర్శించి ఓదార్చారు.

ఎమ్మెల్యే పరామర్శ...

వాల్యా నాయక్ కుటుంబాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పరామర్శించారు.

బాధిత కుటుంబానికి ఆటో డ్రైవర్లు..

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటయ్య ఇటీవల ఉరి వేసుకొని మృతిచెందాడు. అతడు ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. ఆటో డ్రైవర్ వెంకటయ్య కుటుంబాన్ని శనివారం లింగాల మండలం ఆటో డ్రైవర్ల యూనియన్ సంఘం నాయకులు వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేల సాయం అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని పడమటి తండాకు చెందిన ఆరుగురు గోపాల్, లాలు, అంజా, పెద్ద అంజా, లక్ష్మణ్, బాల్య ఈ నెల 22న వెల్దండ మండలంలో కల్వకుర్తి – హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారు హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, చల్లా వంశీచంద్ రెడ్డి తండ్రి చల్లా రాంరెడ్డి బాధితులను పరామర్శించారు. బాధితులకు రూ.5 వేల చొప్పున రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి..

వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్‌కి చెందిన రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ నర్సింహముదిరాజ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.4 వేల నగదు, బియ్యం అందజేశారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

అచ్చంపేట రూరల్: రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేటలోని సీపీఎం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడారు. వానాకాలంలో సాగుకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. నకిలీ విత్తనాలు అమ్మకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు దేశ్యానాయక్, మల్లేష్, శంకర్‌నాయక్, నాగరాజు పాల్గొన్నారు.

అకాల వర్షంతో నష్టం

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లి, పిరట్వానిపల్లి, రాయిచెడ్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీగా వీచిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఇళ్లు, పౌల్ట్రీఫాం ధ్వంసం కాగా.. చెట్లు, కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. అయ్యవారిపల్లిలో బూరం రాములుకు చెందిన ఇల్లు, పిరట్వానిపల్లిలో వీరోజు శ్యాంసుందర్, తాళ్ల నిరంజన్‌కు చెందిన ఇళ్లు ధ్వంసమయ్యాయి. రాయిచెడ్‌కు చెందిన గొడుగు లింగమ్మకు చెందిన పౌల్ట్రీఫాం పూర్తిగా కుప్పకూలింది. ఈ మేరకు శనివారం ఏఆర్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి ఆయా గ్రామాల్లో నష్టాలను పరిశీలించి పంచనామా నిర్వహించారు. గాలివాన బీభత్సంతో గ్రామాల్లో మొత్తం రూ.5.50 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని తహసీల్దార్ శ్రీకాంత్ తెలియజేశారు.

పిడుగు పాటుకు కాడెఎద్దు మృతి

వెల్దండ: మండల పరిధిలోని చొక్కన్నపల్లికి చెందిన ద్యాప చంద్రారెడ్డి రైతుకు చెందిన కాడెద్దు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పాటుకు గురై మృతి చెందింది. శనివారం ఉదయం రైతు చంద్రారెడ్డి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూసే సరికి కాడెఎద్దు మృతిచెందినట్లు గుర్తించారు. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు, నాయకులు కోరుతున్నారు.



చొక్కన్నపల్లిలో మృతిచెందిన కాడెద్దు

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

వెల్దండ: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇష్టానుసారంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజల హామీలు మరిచిపోయిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తిరుగుబాటు చూపారని అన్నారు. నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు. సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, భీమయ్యగౌడ్, నిరంజన్, కొండల్‌యాదవ్, శ్రీను తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాలపై ఆరా

తెలకపల్లి: గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపిక కావడంతో పాఠశాలను సందర్శించారు. ఆ పాఠశాలకు ఏయే సదుపాయాలు కావాలి అని పరిశీలించారు. మరుగుదొడ్ల మరమ్మతు చేయించాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. గ్రామంలో తాగునీరు సరఫరా చేయాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆ గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఏపీఓ మల్లేష్, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

జీలుగ విత్తనాల పంపిణీ

తాడూరు: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో రైతులకు శనివారం వ్యవసాయ అధికారి సాయిరమేష్‌కుమార్ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. మండలానికి 100 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు లక్ష్యం కాగా ప్రస్తుతం 25 క్వింటాళ్లు వచ్చాయని చెప్పారు. 30 కిలోల బస్తా ధర రూ.1,120 ఉందని చెప్పారు. కావాల్సిన రైతులు ఆధార్‌తో పాటు పట్టదారు పాస్ పుస్తకం జిరాక్స్‌లతో జీలుగ విత్తనాలు పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈఓ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు రైతులకు అందజేస్తున్న అధికారి

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

కొల్లాపూర్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం కొల్లాపూర్‌లోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. లక్ష్మీపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రోద్బలంతోనే జరిగిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు ఆరోపించడం వారి సంకుచిత బుద్ధికి నిదర్శనమన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వారికే చెల్లుతుందన్నారు. హత్య రాజకీయాలను ఎవరు ప్రోత్సహించారో ఐదు సంవత్సరాల పాలనలో కొల్లాపూర్ ప్రజలకు తెలిసిందన్నారు. గ్రామ స్థాయిలో జరిగే వ్యవహారాలను మంత్రికి ఆపాదించి రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచనలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారన్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారని, నిందితులు ఎవరో తేలకముందే రాజకీయ ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు నర్సింహరావు, రహీంపాష, బాలస్వామి, నయూమ్, డాక్టర్ రాముడుయాదవ్, నాగరాజు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

వీరోజు మృతికి సంతాపం

నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అంబటిపల్లిలో శనివారం మృతిచెందిన లింగాకారి పెద్ద వీరోజు మృతి సీపీఐకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జీ అన్నారు. శనివారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన అంతిమయాత్రలో పాల్గొని ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. నాయకులు హాజరై మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మారేడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐకి తీరని లోటు

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లికి చెందిన లింగాకారి పెద్ద వీరోజీ మృతి సీపీఐ పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్‌జీ అన్నారు. శనివారం అనారోగ్యంతో మృతిచెందిన వీరోజీ పార్థివ దేహంపై పార్టీ పతాకాన్ని ఉంచి నివాళి అర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి పార్టీల కతీతంగా పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అవిశ్వాసానికి తీర్మానం



వివరాలు తెలియజేస్తున్న అధికారులు

తాడూరు: సింగిల్‌విండో చైర్మన్‌గా గతంలో ఉన్న ఎండీ సమ్మద్‌పాషాపై అవిశ్వాసానికి తీర్మానం చేయడంతో విండో చైర్మన్‌గా ఉన్న సమ్మద్‌పాషా రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. కొత్త చైర్మన్‌ను నియమించేందుకు ఉన్నత అధికారులు ఈ నెల 29న కొత్త చైర్మన్ ఎంపిక కోసం ఎన్నికల కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారి శ్రీరాములు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో సంబంధిత డైరెక్టర్లకు నోటీసులు అందజేశారు. 29న ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కొత్తగా చైర్మన్ కోసం దాఖలు చేయాలంటూ అదే రోజు 3 గంటల నుంచి 5 గంటల వరకు ఎన్నిక నిర్వహించడం జరుగుతుందన్నారు. చైర్మన్ పదవికి ఒకే నామినేషన్ వస్తే.. ఏకగ్రీవంగా ఎన్నిక జరుగుతుందన్నారు. నోటీసులు తీసుకున్న డైరెక్టర్లు 29న ప్రాథమిక సహకార పీఏసీఎస్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఉద్యోగులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఇచ్చిన పిలుపు మేరకు హెల్త్ చాలెంజ్‌లో భాగంగా డిపోలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వంద మంది ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపరీక్ష, కంటి పరీక్ష, ఈసీజీ టెస్టులు చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ఎండీ ఆదేశానుసారం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు డీఎం ఉమాశంకర్ తెలియజేశారు. వైద్యసిబ్బంది లోకేష్, మహేందర్, స్రవంతి, శృతి, అక్షయ, ఎంఎఫ్. యాదయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.